# తేదీలేని డైరీ

కొడుకుల అనంతరావు

"ఎనిమిది గంటలైంది, మీ నాన్నను లేపు! ఒరే! బాబిగా!! మనం మహారాజుల మేంగాదు, వంది మాగధులు వచ్చి లేపడానికి! చేస్తూ వున్నది గుమాస్తాగిరీ, పది గంటలకు ఆఫీసుకు తగులడక్కపోతే ఈ వున్న ఆ ఒక్క ఉద్యోగానికి కూడ తిలోదకాలే!.... ఊఁ! మిమ్మలినే.... లేస్తారా?"

* * *

"కాఫీ అలా గడగడ త్రాగేస్తున్నారు! బాగుందా?"

...... .......

"ఊరుకుంటారేం? బెల్లం మొత్తిన రాయిలాగ! కాఫీ ఎలా వుంది?"

"........బాగుంది."

"బాగుందా? పంచదార వుందా?"

"పంచదార లేకుండానే బాగుంది!"

"ఏడిసినట్లే వుంది! .... అంటే మరి పంచదార కొనరన్నమాట!"

"మన 'కోటా' అంతా తెచ్చేసేను గదా!"

"వెధవ 'కోటాలు' 'లకోటాలు' ఎవడిక్కావాలండీ! నలుగురినీ చూసేనా నేర్చుకోవాలి. అందరూ మనమాదిరి 'బ్ర[illegible]మానాలు' కారు!"

"అయితే ఏం చేయమంటావు?"

"వెళ్లి వురెట్టుకోమంటాను! మొగుడు చాతకాని వాడయితే చేసేదేముంది! ఏ నుయ్యో గొయ్యో చూసి మమ్మల్ని తోసేసి మీరూ దూకండి!"

"చాతకాని వాడికి అంతటి చేవకూడు ఎక్కడిది?"

* * *

"ఒరేయ్ వెంకన్నా!"

.... ............

"ఓయ్! వెంకన్నా!"

" (గుర్!....లేచి)....ఆ! బాబ్బాబు!"

"చూడు. ఇప్పటి నుంచీ నిద్రపోతే, రాత్రంతా ఏంచేస్తావ్?"

"సినీమా చూస్తానండి."

"ఆఫీసులో ప్రతిరోజూ సుషుప్తిలోనే వుంటావు, మరి రోజూ సినీమా చూస్తూ వుంటావేమిటి?"

"మరేమండి! నాకు మరో పనేముందండి?"

"డబ్బు లెక్కడిదోయ్?"

"అంతా మీ చలవేగదండి!"

"ఏడిసేవ్లే, చూడు ఆ ఏ సి. ఫోరు వచ్చేడా?"

"ఎవరండి బాబు?"

"అదేనోయ్ ఆ మూల కూర్చుంటారే బిల్లు క్లార్కు."

"రావుగారా అండీ?"

"అవునోయ్! అబ్బ నీకు సంజాయిషీ ఇస్తూ కూచుని నా ఓపిక తీరిపోతోంది! మరి నువ్వు బంట్రోతువు నేను హెడ్డు గుమాస్తాని ఎందుకులే రా!.. వచ్చి ఇలా నా సీట్లో కూచో!"

"అంత అదృష్టం నాకెక్కడిది బాబు! అక్కడ కూకోవాలంటే ఎన్ని చదువులుండాలి! ఎన్ని సాధకాలుండాలి!!"

"సాధకాలేమిటయ్యా! నీ తలకాయ! ఇవేవి 'సరిగమ'లనుకున్నావేమిటి సాధకాలంటున్నావు."

"ఓయబ్బో! ఆ సంగీతంకంటె పెద్ద సాధకాలే గావాలి బాబు ఈ ఉద్యోగానికి."

"ఇదేదో పెద్ద తగున్నలానే వుందే! ఏమిటోయ్ ఈ సాధకాలు?"

"ఓ మూల కూచుని ఎవరితోను మాట్లాడకుండా సాధకం జేస్తే సంగీతం వచ్చేస్తుందండి. కాని పెద్ద ఉద్యోగాలు కావాలంటే మరో రకం సాధకం చెయ్యాలండి! క్రింది వాళ్లను తోటివాళ్ళను త్రొక్కేసి పెద్ద వాళ్ళను పట్టుకుంటేగాని పదవులు రావండి. ఇదో పెద్ద విద్య బాబు! చెప్పాలంటే చాలా పాయింట్లు! లటిగేషన్లు వున్నాయండి అరుగో!! ఏ. సి. ఫోర్ వచ్చి కూచున్నారండి. పిలిచేదా బాబు?"


"..ఆ వద్దులే! నీపని చూసుకో."

"నా పనంతా మీపని చూడడమే గదండీ!"

"(అమోదించేవ్!) సరేలే! అలా పోయి నీ బెంచీమీద కూచుంటావా! నాయనా!!"

"చిత్తం బాబూ! చెప్పుడికండి! అలా పోయి ఓ బీడీ ముక్క .."

"ఆ, వెళ్ళు! .... (నయం!! నన్ను డబ్బు అడగలేదు!) వెధవలు! ఈమధ్య ఈ గ్రేడు ఫోర్ గాళ్ళకు పొగరెక్కువయి పోయింది! పూర్వం గుమాస్తాతో, అందులోను హెడ్డు గుమాస్తాతో ఎదురుపడి మాట్లాడాలంటే ఎన్ని గుండెలుండాలి!! పదిసార్లు ముందు వెనుకలాలోచించి, గుండె దిటవుచేసుకుని వచ్చి వదడుగుల




ద్వారంలో నిలచి చేతులు పిసుక్కుంటూ, బుర్ర గోక్కుంటూ మహా వినయ విధేయ తలతో. .ప్చ్! అదంతా మరెక్కడ?! కలికాలం!!....ఆ! బి. సి. ఘోర్ గారు! .. ఇలా ఓమారొస్తావా?"

"యస్ సర్!....నా పేరు రామారావండి!"

"నాకు తెలుసునోయ్. కాని, ఆఫీసులో పేర్లు గీర్లు వుండవోయ్. నీ సీటు పేరే నీ పేరు. ఇవాళ 'బి. సి. ఘోర్'వి, రేపు 'సి. సిక్సు'వి, ఎల్లుండి 'ఎ. త్రీ'వి, నువ్వే అవుతూ వుంటావు. తెలిసిందా?"

"ఆ సంగతి తెలియలేదండి!"

"అవునులే. ఎలా తెలుస్తుంది! నువ్వింకా సర్రాడవేగా! నాలా పదికాలాల పాటు పనిచేస్తే నీకూ తెలుస్తుందిలే!"

"ఏమోనండి!"

"ఏమోనేమిటోయ్! నీ వయస్సెంత?"

"అయిదేళ్ళండి."

"ఓస్! ఇంతేనా! ఆ! పైసా సరదా ఏమైనా చేస్తున్నావా?"

"లేదండి."

"పెళ్ళి సిటేగా!"

"ఉప్పనండి."

"అయితే, మరీ అంత అమాయకం పనికి రాదోయ్."

"అమాయకం కాదండి. భయమండి."

"భయమా?! ఎందుకూ?"

"లే! ఉన్న ఒక్క ఉద్యోగము ఊడి పోతే!...."

"ఓయినీ....! పిరికి పందవన్నమాట! చూడు పెద్ద వాడివి చెబుతున్నాను. దేని కేనా గుండె ధైర్యం వుండాలి! మొన్న మా మూలో అల్లుడిని లంచం పుచ్చు కున్నాడని పనిలో నుండి తీసేసేరు. నా సలహా అడిగేడు. మందుల షాపు పెట్టు నాయనా అన్నాను, అంతే, షాపు పెట్టే సేడు. డాక్టర్లను మంచి చేసేసుకున్నాడు. ఆర్నెల్లవలేదు ఒక స్కూటరు, ఏడాది తిరిగిందో లేదో ఒక ఇల్లు, ఇప్పుడు పంచాయతీ బోర్డు మెంబరు! తెలిసిందా? మనిషి చిమ్మిరపకాయంటివాడు. దేనికేనా ధైర్యం. చొరవ వుండాలోయ్! గుమాస్తా గాడు పుచ్చుకోకపోతే ఆఫీసరెలా పుచ్చు కుంటాడోయ్? తనకు కాకపోయినా ఒకళ్ళ గురించేనా పుచ్చుకోవాలా? బ్రతుకు తెరవు ఎలాగా?

"ఏమోనండి....నావల్ల గాదండి!"

"నాన్‌సెన్స్! వర్తి....! బి. ఏ. పాస యేవలు! బి. ఏ.!! ఎందుకు? ఆ చదువు కాల్చనా! నాకే ఆ చదువుంటే ఈపాటికి కోటికి పడగలెత్తేద్దును!"

"ఇప్పుడు మాత్రం ఏం తక్కువైం దండి. లక్షలకు ఎదిగేరు గదా!"

"ఏదోలే! అయినా, ముష్టి లక్షలు ఎవడిక్కావాలయ్యా?... ఏదో గుంభనగా, పొదుపుగా, నివురుగప్పిన నిప్పులా, నిదా నంగా బ్రతికితే ఇంతేనా అయింది. ఎందు



కేనా మంచిది, పెద్దవాడివి చెబుతున్నాను, ఇప్పటికయినా తెలివి తెచ్చుకో!....చూడు! ఆ కంట్రాక్టరు రంగనాథం వచ్చి 'ఏదో యథాశక్తిగా తాంబూలం ఇచ్చుకుంటాను ఆ బిల్లు వేగం 'పాస్' చేయించమంటు న్నాడు. నీ దగ్గరకు పంపేను వచ్చేడా?"

'వచ్చేడండి. కాని బిల్లులో తప్పు లున్నాయి పాస్ అవదు అని చెప్పేనండి."

"ఏడిసేవ్! నీలాటి అసమర్థులవల్లే మనదేశం ఇలావుంది! నీలో 'టాక్టు లేదు. నిన్నా సీటునుంచి మార్చేయాలి!"

"చాలా థేంక్సండి!"

"ఎందుకు?"

"బ్రతుకుతానండి!"

"వాట్?!?"

"ఆ ఏం లేదండి!"

* * *

"ఏరా బాబీ! ఇలా వచ్చేవేం? క్లాసు లేదా?"

"మా స్కూలు స్ట్రైకు నాన్నా."

"ఎందుకురా?"

"మా హెడ్మాష్టర్‌ని బదిలీ చేయ లేదని."

"ఏం చేసేడని?"

"గొప్ప స్ట్రిక్టు నాన్నా!"

"మంచిదే గదురా?"

"మా కుర్రాళ్ళకు వచ్చలేదు, మా యూనియన్ లీడర్లకు ఆయనంటే పడదు."

"చాలా బాగుందిరా బాబూ!! మరయితే ఇక్కడకెందుకు వచ్చినట్లు?"

జ్యోతి


"సినిమాకు డబ్బులు కావాలి నాన్నా!"


* * *

సర్వోదయా నాయకులు వేంకట రామయ్యగారి షష్ఠిపూర్తి మహోత్సవం ఘనంగా జరుగుతోంది. మంత్రివర్యులు రామనాథంగారు ఉపన్యసిస్తున్నారు:—

"సోదర సోదరీమణులారా! ఈ శుభ సమయాన నన్ను పిలిచి ఓ నాలుగు ముక్కలు చెప్పమన్నందుకు ఈ సభ కార్యకర్తలకు నా అభినందనలు. వినడానికి వచ్చిన మీ అందరకు నా కృతజ్ఞతలు. ఏనాడో పెద్దలు చెప్పినట్లు ఈ మానవ జన్మ బహు దుర్లభం. అది దొరికాక బాలారిష్టాలు, చదువు సంధ్యలు, యవ్వనపు మగనాలి తగవులు, మధ్యలో వచ్చిన ఆస్తి తగవులు, వ్యవహారపు చిక్కులు దాటుకుంటూ ఓ పార్టీలో చేరి నాయకుడవడం ఏ ఒక్కరికోగాని అందరికీ వీలయ్యే పనిగాదు! (కరతాళధ్వనులు) అన్నిటినీ దాటి ఏదో ఇంత దేశసేవ చేయాలని తీవ్రంగా తలపు గలిగేసరికి మంత్రి పదవి తప్పిందిగాదు. మంత్రి అవకపోతే దేశసేవ జేయడం అసాధ్యమని మీకు తెలుసుగదా! (కరతాళ ధ్వనులు!) కాని, పడితేగాని లోతు తెలియదు. కడుపుకి తిండి, కంటికి నిద్ర కరవై పోయేయి! ఎప్పుడూ మీటింగులు, పార్టీ వ్యవహారాలు ప్రతినిధి వర్గాలు విధి విరామం లేకుండా ప్రాణం విసిగించేస్తాయి. కొంత విశ్రాంతి కోసమని ఒక సాంస్కృతిక రాయబారంలో ఓ నాలుగు దేశాలకు వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు మా ఆవిడ పిల్లలు ముచ్చట పడ్డారని ఓ మోటారు కారు, రేడియో గ్రాముకొని తెచ్చుకుంటే అందరి కళ్లూ వాటిమీదే పడ్డాయి. ప్రధాని ఫర్మానాలు ముఖ్యమంత్రి ముక్తాయింపులు వచ్చి చేరేయి. అందరూ వాటికి లెక్కించుకుంటారేగాని, స్వార్జితంగా తృణమో పణమో చేసుకుంటే పడి ఏడుస్తారు (కరతాళ ధ్వనులు)...."

అమాత్యులు ఆక్రందనలు సభ్యుల




సానుభూతులు కరతాళధ్వనులు ఎలా వున్నా షష్ఠిపూర్తి చేయించుకుంటూ వున్న వేంకటరామయ్యగారు మాత్రం వేదిక మీద గుర్రుపెట్టి నిద్రపోతున్నారు! పాపం! కష్టజీవి!!!

* * *

'ఎందుకింత ఆలస్యం?"

"వస్తూ త్రోవలో మీటింగు కెళ్లేను."

"మంత్రిగారేనా మాట్లాడేరు?"

"ఆ! ఇంకా మాట్లాడుతూనే వున్నారు."

"పూర్తయే వరకూ వుండలేదా?"

"స్వంత డబ్బా కొడుతున్నాడు."

'చాలు! మీకదీ చేతకాదు!"

* * *

"....వంటయిందా?"

"ఆ. వెళ్లి వడ్డించుకోండి, నాకు నిద్ర వస్తోంది."

"నీ భోజనం అయింది గదా?"

"ఆ. ఏదో చేసేను."

"అయితే మరి ఫరవాలేదు."

* * *

ఓ దినం గడచింది. నిన్నటికి ఇవాళకు మధ్య మార్పులేదు. నేటికి రేపటికి వుండదు. మార్పు కావాలంటే నన్నే మారమంటుంది లోకం! అది ఎట్లా సాధ్యం? ఈ కాలానికి లోకానికి నేను ఒక అసమర్థుడినే!! ....'సమర్థత' అనేది ఎందులో వుంది? లోకపు చూపులోనా లేక 'నైతిక పతనం'లోనా?' 'నియతి', 'న ఇతి' లాంటి ప్రయోగాలతో 'నీతి' ఏర్పడిందంటారు. 'ఇది కాదు' అనేదే 'నీతి' అయితే 'సమర్థత' కూడ 'అసమర్థతే' అవుతుందా???

*